నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | ఆదివారం 18 ఆగస్టు 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

పిచ్చి మొక్కల తొలగింపు

● 'నమస్తే'కు స్పందన..

పిచ్చి మొక్కలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

బెల్లంపల్లి, ఆగస్టు 17 : బెల్లంపల్లిలోని కాళోజీ శాఖ గ్రంథాలయం ఆవరణలో అపరిశుభ్రంగా ఉండగా, ఈ నెల 15న 'ఫొటోలకు ఫోజులిచ్చారు.. పారిశుధ్యం మరిచారు' శీర్షికన 'నమస్తే తెలంగాణ' కథనం ప్రచురించింది. ఇందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ శ్రీనివాసరావు స్పందించారు. వారి ఆదేశాల మేరకు పారిశుధ్య సిబ్బంది శనివారం డోజర్ సాయంతో ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించారు. మిగతా పనులను మంగళవారం కొనసాగిస్తామని జవాన్ రామస్వామి తెలిపారు. పిచ్చి మొక్కలు తొలగించడంతో పోటీ పరీక్షల అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రంథాలయాధికారి ఉప్పుగోపికి అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్

కోటపల్లి, ఆగస్టు 17 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ అన్నారు. కోటపల్లి మోడల్ స్కూల్‌లో డ్రగ్స్ నిర్మూలనపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డీసీపీ మాట్లాడారు. కొంతమంది మత్తు పదార్థాలకు బానిసై వారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, చిన్నతనం నుంచే యువత పెడదారి పడుతుండడంతో అనేక అనర్థాలు జరుగుతున్నాయన్నారు. పల్లెల్లో మత్తు పదార్థాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్, కోటపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం రణం

● ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు
● ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం
● రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన ఎమ్మెల్యే అనిల్‌జాదవ్
● పలుచోట్ల అధికారుల నిలదీత
● కవ్వాల్ జీపీ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

నెన్నెలలో రోడ్డు పై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు, నాయకులు

జన్నారం కవ్వాల్ గ్రామంలో పురుగుల మందును పట్టుకొని నిరసన తెలుపుతున్న రుణమాఫీ కాని గిరిజనేతర రైతులు

మంచిర్యాల, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ తమకు వర్తించకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శనివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. రాస్తారోకోలు.. ర్యాలీలు నిర్వహించారు. ముఖ్యమంత్రి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. తలమడుగు మండలం కేంద్రంలో 500 మంది రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను డప్పులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శవయాత్ర నిర్వహించి చెప్పులతో కొట్టారు. అనంతరం దహనం చేశారు. బోథ్‌లో రైతులు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. భీంపూర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. బోథ్ మండల కేంద్రంలో నిరసన ర్యాలీ తీసి నిర్మల్ రహదారిపై రాస్తారోకో చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. తాంసి, గిమ్మలో రైతులు ఆందోళన చేపట్టారు. రుణమాఫీ జాబితాలో పేర్లు లేకపోవడంపై నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రుణమాఫీ ఎందుకు కాలేదని ఏఈవోలను నిలదీశారు. జైనథ్ మండలం కేంద్రంలో జరిగిన రాస్తారోకోలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ రోడ్డుపై బైఠాయించి రైతులకు మద్దతు ప్రకటించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రుణమాఫీ పేరిట రైతులను మోసం చేసిందని

కాంగ్రెస్ సర్కారు తీరుపై రైతుల ఆగ్రహం

ఆయన మండిపడ్డారు. కేవలం 40 శాతం మంది రైతులకు నామ్‌కే వాస్తేగా రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ. 2 లక్షల రుణాలను మాఫీ చేయాలన్నారు. ప్రభుత్వం అర్హులైన రైతుల పంట రుణాలు మాఫీ చేసే వరకూ ఆందోళనలు కొనసాగిస్తామని రైతులు తెలిపారు. జైనథ్‌లోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బీవోఎం మేనేజర్ శివ ప్రసాద్‌ను రుణమాఫీ కాలేదని రైతులు నిలదీశారు. బ్యాంకు అధికారులు రుణ డేటా తప్పుల తడకగా ఉందని, తమకు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్ ఎదుట రైతులు రాస్తారోకో చేశారు. పోలీసు, వ్యవసాయ అధికారులు సముదాయించినా వినలేదు. కలెక్టర్‌తో ఫోన్‌లో రైతులతో మాట్లాడించారు. ఆదిలాబాద్ ట్రెయినీ అభిజ్ఞాన్ మాలవియా జైనథ్ బ్యాంక్ అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నా రాస్తారోకోను విరమించారు. జైనథ్‌లో బోరజ్ జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. మహారాష్ట్ర, తెలంగాణ మధ్య రాకపోకలకు 40 నిమిషాల పాటు అంతరాయం కలిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన రైతులు అర్హులకు రుణమాఫీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య రైతుల వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామని సూచించడంతో రైతులు ఆందోళన విరమించారు.

రుణ మాఫీ కోసం రోడ్డెక్కిన రైతులు

నెన్నెల,ఆగస్టు17 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలో రైతులు రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని సీఎం వెంటనే రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు సింగతి రాంచందర్ డిమాండ్ చేశారు. రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, వందలాది మంది రైతులకు అన్యాయం చేసిందని మండిపడ్డారు. రూ. 20 వేల రుణం మాఫీ కాని రైతులు కూడా ఉన్నారని, ప్రభుత్వం మాత్రం అందరికీ రుణమాఫీ చేశామంటూ గొప్పలు చెప్పుకుంటుందన్నారు. రైతులు ఖరీఫ్ పంటలు వేసి మూడు నెలలు గడుస్తున్నా రైతు భరోసా ఇవ్వలేదని మండిపడ్డారు. రుణమాఫీ కాని రైతులకు ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేశ్, నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఇబ్రహీం, అశోక్‌గౌడ్, మొండన్న, పాపయ్య, కొడిపే శంకర్, మాజీ సర్పంచ్‌లు శంకర్, బాపు, తోట మధు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

గిరిజనేతర రైతుల నిరసన

కవ్వాల్ జీపీ ఎదుట ఒకరి ఆత్మహత్యాయత్నం

జన్నారం, కవ్వాల్ 17 : రుణమాఫీ కాలేదంటూ గిరిజనేతర రైతులు పురుగుల మందు డబ్బాతో నిరసనకు దిగిన ఘటన మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో శనివారం జరిగింది. రైతులు కుమ్మరి మల్లయ్య, జక్కుల లచ్చన్న, మైమూద్ అలీఖాన్, గుమ్ముల సత్తన్నలతో పాటు 75 మంది గిరిజనేతర రైతులు రుణమాఫీ కాలేదంటూ పురుగుల మందు డబ్బాతో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. గొల్ల లచ్చన్న పురుగుల మందు తాగేందుకు యత్నించగా, పక్కనే ఉన్న గుడ్ల బుచ్చన్న అనే రైతు మందు డబ్బాను బలవంతంగా లాగేసుకున్నాడు. శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రుణాలు మాఫీ చేయాలని, లేదంటే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కవ్వాల్ క్లస్టర్ విస్తరణాధికారి సయ్యద్ అక్రమూల్లాను వివరణ కోరగా.. రుణమాఫీ కాని వారికోసం సర్వే చేస్తున్నామని, అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

అక్రమాలపై అన్నదాతల ఆగ్రహం

● రెబ్బెన పీఏసీఎస్‌లో జరిగిన అవినీతిపై ఆందోళన
● అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో
● బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ ● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

రెబ్బెన పీఏసీఎస్ ఎదుట అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు

రెబ్బెన, ఆగస్టు 17 : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం(పీఏసీఎస్)లో జరిగిన అక్రమాలపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణాలు తీసుకోకున్నా తీసుకున్నట్లు, రుణాలు మాఫీ అయినా.. కానట్లు, చనిపోయిన వారికి సైతం రెన్యువల్ అయినట్లు రికార్డుల్లో ఉండడంతో ఆందోళనకు దిగారు. పీఏసీఎస్ అధికారుల నిర్వాకం వల్ల తాము నష్టపోయామంటూ శుక్రవారం రాత్రి పీఏసీఎస్ కార్యాలయానికి చేరుకొని సీఈవో సంతోష్‌ను నిలదీశారు. ఎంతకూ స్పందించకపోగా, మాజీ జడ్పీటీసీ జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు సమచారం అందించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ అనంతలక్ష్మి కార్యాలయానికి చేరుకొని విచారణ చేపట్టగా, రికార్డులు కనిపించలేదు. కంప్యూటర్ పని చేయలేదు. దీంతో శనివారం పూర్తి విచారణ చేపడుతామని హామీ ఇవ్వడంతో రైతులు, నాయకులు వెళ్లిపోయారు. శనివారం ఉదయం జిల్లా సహకారం సంఘం ఆడిట్ అధికారి రబ్బానీ, సొసైటీ ఆడిటర్ కావేరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణల బృందం కార్యాలయానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. రైతులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు అక్కడికి చేరుకొని అధికారులను నిలదీశారు. అక్కడి నుంచి రైతువేదిక వద్దకు చేరుకోగా, తాళాలు వేసి ఉండడంతో పగుల గొట్టారు. ఆపై అధికారులు సమావేశం నిర్వహించగా, వారితో రైతులు, నాయకులు వాగ్వాదానికి దిగారు. అనంతరం పీఏసీఎస్‌లో 374 మంది ఖాతాలు కలిగిన జాబితా తెప్పించి.. అందరి సమక్షంలో లిస్టు చదివి వినిపించగా.. అందులో అవకతవకలను చూసి అవాక్కయ్యారు. తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేయగా, అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో మండిపడ్డారు. రైతులు, వివిధ పార్టీల నాయకులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్దకు చేరుకొని అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎస్ఐ చంద్రశేఖర్ అక్కడికి చేరుకొని రైతులు, వివిధ పార్టీల నాయకులను సముదాయించినా వారు వినిపించుకోలేదు. కలెక్టర్ రావాల్సిందేనని పట్టుబట్టారు. ఆపై అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రామ్మోహన్‌రావుకు వినతిపత్రం అందించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్ కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేశ్ సైతం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లావు ద్యరమేశ్, మాజీ జడ్పీటీసీలు సంతోశ్, దుర్గం సోమయ్య, మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, బీజేపీ నియోజక వర్గ ఇన్‌చార్జి లక్ష్మి, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, నాయకులు చిరంజీవిగౌడ్, శ్రీనివాసగౌడ్, ఇమ్రోజ్, అన్నాజీ, ఆనంద్, నవీన్‌గౌడ్ ఉన్నారు.

మందమర్రి పాతబస్టాండ్ పీహెచ్‌సీ ఎదుట వైద్యులు, సిబ్బంది నిరసన

నెన్నెల : పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

బెల్లంపల్లి చౌరస్తాలో మానవహారంగా ఏర్పడ్డ ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల వైద్యులు, వైద్య విద్యార్థులు

కాగజ్‌నగర్ : పట్టణంలో ఐఎంఏ ఆధ్వర్యంలో ర్యాలీ

జైనూర్ : ర్యాలీ తీస్తున్న వైద్యులు, సిబ్బంది

వైద్యుల కన్నెర్ర

కోల్‌కతా హత్యాచార ఘటనపై హోరెత్తిన నిరసనలు

● సేవలు నిలిపివేసి డాక్టర్లు, నర్సులు, సిబ్బంది ఆందోళన
● ప్లకార్డులతో ర్యాలీలు.. మానవహారాలు
● నిందితులను శిక్షించి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్

మంచిర్యాల అర్బన్ : ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నర్సులు

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనపై వైద్యులు, నర్సులు, సిబ్బంది కన్నెర్ర చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో సేవలు నిలిపివేసి నిరసనలు చేపట్టారు. ప్రధాన వీధులగుండా ర్యాలీలు తీశారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. సాయంత్రం కొవ్వొత్తులను ప్రదర్శించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. - నమస్తే బృందం

హాజీపూర్ : క్యాండిళ్ల తో ర్యాలీ తీస్తున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు

మంచిర్యాల అర్బన్ : ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థినులు

ఉదయం కట్టి.. సాయంత్రం కూల్చేసి

● గ్రీన్‌సిటీలో పెచ్చుమీరిపోతున్న అక్రమాలు
● కట్టడం రాళ్లు తీసి పెట్టడంతో కూలిన రాళ్లవాగు ప్రహరీ

రాళ్లవాగు ఫ్లైఓవర్ రోడను ఆనుకొని నిర్మిస్తున్న పునాది (ఉదయం)

పునాది నుంచి తీసిన రాళ్లను పెట్టడంతో కూలిపోయిన రాళ్లవాగు ప్రహరీ (సాయంత్రం)

మంచిర్యాల గ్రీన్‌సిటీలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. మున్సిపాలిటీకి అప్పగించిన రోడ్లను సైతం ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తున్నారు. కార్మెల్ స్కూల్ నుంచి గ్రీన్‌సిటీకి వెళ్లే పై ఓవర్ గోడ పక్కనే రోడ్డు ఉంది. ఆ రోడ్డు పక్కనే ఉన్న కొద్దిపాటి స్థలం(ఈ స్థలం లే-అవుట్ చేసినప్పుడు రోడ్డు కింద మున్సిపాలిటీకి అప్పగించారు)లో రెండు రూమ్‌లు నిర్మించేందుకు ఓ వ్యక్తి సిద్ధమయ్యాడు. గ్రీన్‌సిటీలో బట్టలు ఇస్త్రీ చేస్తూ, ఇండ్లలో పాచి పనులు చేసే వ్యక్తి కుటుంబానికి పై ఓవర్ గోడ పక్కన ఉన్న ల్యాండ్‌ను గ్రీన్‌సిటీలో ఉండే ఓ పెద్ద మనిషి విక్రయించినట్లు తెలిసింది. సదరు వ్యక్తి తన ఊరిలో ఉన్న కొద్దిపాటి స్థిరాస్తులు విక్రయించి రూ.4 లక్షలు ఇచ్చికొన్నట్లు సమాచారం. ఆ స్థలంలో ముందు చిన్న టేలా పెట్టుకున్నాడు. ఆపై అదే స్థలం(మున్సిపాలిటీ)లో శనివారం ఉదయం రూమ్‌లు కడుతున్నారనే సమాచారమందుకున్న 'నమస్తే తెలంగాణ' అక్కడకి వెళ్లి ఫొటోలు తీసింది. అదే సమయంలో అక్కడికి టౌన్ ప్లానింగ్ అధికారులు సైతం వచ్చారు. విషయం తెలుసుకున్న పెద్ద మనిషి తనపైకి ఎక్కడ వస్తుందోనని సాయంత్రం నిర్మించిన పునాది నుంచి రాళ్లు తీసి రాళ్లవాగు ప్రహరీ పక్కన పెట్టేశారు. దీంతో ఆ బరువు తట్టుకోలేక రాళ్ల వాగు ప్రహరీ 30 మీటర్ల నుంచి 35 మీటర్ల వరకు కూలిపోయి.. వాగులో పడిపోయింది. దీంతో కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రాకపోకలు సాగించే మార్గంలో ఇలా ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అత్యాశకుపోయి రాళ్ల వాగు ప్రహరీ కూలేందుకు కారణమైన వ్యక్తులపై మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటారా.. లేదా అనేది వేచి చూడాలి. ఉదయం ఈ అక్రమ కట్టడాన్ని పరిశీలించిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలుసుకుందామని 'నమస్తే తెలంగాణ' వారిని సంప్రదించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

- మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్

● జన్మదిన శుభాకాంక్షలు
● పొలిటికల్
● స్వదేశాగమనం
● లీగల్ ప్రకటనలు
● క్లాసిఫైడ్స్
● పదవీ విరమణ
● ప్రారంభోత్సవం
● శ్రద్ధాంజలి
● సినిమా
● వివాహ మహోత్సవం
● షష్టిపూర్తి మహోత్సవం
మరియు
● అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679